


...అను నేను



ప్రమాణ స్వీకారం అనంతరం అసెంబ్లీ రిజిస్టర్లో సంతకం చేస్తున్న చంద్రబాబు











అసెంబ్లీలో వేడుకగా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

తిరుపతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో అలుపెరగక పోరాడి చిరస్మరణీయ విజయం సాధించిన 17మంది ఎమ్మెల్యేలు శుక్రవారం శాసనసభలో ప్రమాణ స్వీకారం చేశారు.కుప్పం నుంచీ వరుసగా ఎనిమిదవ సారి అద్భుత విజయం సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణస్వీకారంతో కార్యక్రమం ప్రారంభమైంది.చిత్తూరు జిల్లాలో పలమనేరు నుంచి అమరనాథరెడ్డి,నగరి నుంచి గాలి భానుప్రకాష్,చిత్తూరు నుంచి గురజాల జగన్మోహన్, పూతలపట్టు నుంచి మురళీమోహన్, జీడీనెల్లూరు నుంచి థామస్,పుంగనూరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లాలో పీలేరు నుంచి నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి, మదనపల్లె నుంచి షాజహాన్ బాషా, తంబళ్లపల్లె నుంచి ద్వారకనాథ రెడ్డి, తిరుపతి జిల్లాలో చంద్రగిరి నుంచీ పులివర్తి వెంకటమణి ప్రసాద్ అలియాస్ నాని,తిరుపతి నుంచి ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి నుంచీ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి,వెంకటగిరి నుంచీ కురుగొండ్ల రామకృష్ణ, సత్యవేడు నుంచీ కోనేటి ఆదిమూలం, సూళ్ళూరుపేట నుంచీ నెలవల విజయశ్రీ, గూడూరు నుంచీ పాశం సునీల్ కుమార్ ప్రమాణస్వీకారం చేశారు.వీరిలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఓం నమోవెంకటేశాయ...అంటూ మొదలుపెట్టి దైవసాక్షిగా ప్రమాణ స్వీకారం చేయగా పెద్దిరెడ్డి ఆంగ్లంలో ప్రమాణం చేశారు.









బేనీషా @ రూ.110

- కలర్ తోతాపురి రూ.43



మండీలో వేలం పాట

బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో శుక్రవారం నాణ్యమైన బేనీషా (బంగినిపల్లి) రకం మామిడి కిలో రూ.110 ధర పలికింది. నాణ్యమైన కలర్ రకం తోతాపురిని రూ.43 వంతున కొనుగోలు చేశారు. సుధాకర్ నాయుడు మండీలో బెంగళూరుకు చెందిన వ్యాపారులు పోటాపోటీగా టన్ను బేనీషాను రూ.1.10లక్షలకు కొన్నారు. మేలైన కలర్ తోతాపురిని ఎస్‌పీఎస్ మండీలో టన్ను రూ.43 వేలకు చెన్నైకి చెందిన వ్యాపారులు కొనుగోలు చేశారు. నాణ్యమైన మల్లిక రకం మామిడి కిలో రూ.70- రూ.80.. కాలేపాడు రకం రూ.50 నుంచి రూ.90.. నాటీరకం రూ.15 నుంచి రూ.22 వరకు ధరలు పలికాయి. గుజ్జు పరిశ్రమలకు తరలించే తోతాపురి మాత్రం కిలో రూ.27 ధర పలికింది.

- బంగారుపాళ్యం



కలర్ తోతాపురి రకం

పంచాయతీల ఆశలన్నీ పవన్‌పైనే

గత ప్రభుత్వంలో ఆర్థిక సంఘం నిధుల మళ్లింపుపై డిప్యూటీ సీఎం ఆగ్రహం

పంచాయతీ నిధులపై సమగ్ర నివేదిక కోరడంతో సర్పంచుల్లో చిగురిస్తున్న ఆశలు

పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను వైసీపీ ప్రభుత్వం మళ్లించేసింది. సర్పంచులను డమ్మీలుగా మార్చేసింది. గ్రామ పాలకులు ఎన్ని ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి రావడం.. పంచాయతీరాజ్ శాఖపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్షించడం.. నిధుల మళ్లింపు ఆగ్రహించడం.. నివేదికను కోరడం.. ఈ పరిణామాలతో సర్పంచులు కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



పంచాయతీలకు నిధులు ఇప్పించాలంటూ గతేడాది జూలైలో చిత్తూరులో ధర్నా చేసిన సర్పంచులు

జిల్లాలో 697 గ్రామ పంచాయతీలున్నాయి. వీటికి 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్ని విడతల వారీగా సుమారు రూ.120 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. గ్రామ పంచాయతీల అకౌంట్లలో డబ్బులు జమయిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధుల్ని వెనక్కి తీసుకునేది. ఇతర అవసరాలకు మళ్లించేసేది. దీంతో కేంద్రం ప్రతి పంచాయతీలోనూ నూతన అకౌంట్ తెరవాలని, నిధుల్ని సీఎఫ్ఎంఎస్ ద్వారా వాడుకోవాలని ఆదేశించింది. అయినా రాష్ట్ర ప్రభుత్వం తీరులో మార్పు రాలేదు. అసలు పంచాయతీల ఖాతాలకు కేంద్ర నిధులు ఎన్నడూ జమ చేయకుండా నేరుగా తీసుకునేది. దీంతో సర్పంచులు చిన్నపాటి పనులు కూడా చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో గౌరవం కోసం అప్పులు చేసి పనులు చేపట్టిన సర్పంచులకు డబ్బులు విడుదల కాలేదు. ఇలా జిల్లాలో సర్పంచులకు సుమారు రూ.28 కోట్ల వరకు బిల్లులు పెండింగులో ఉన్నాయి. తమను ఎన్నుకున్న ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నామని నలిగిపోయారు. అధికారాలన్నీ వలంటీర్లకు, సచివాలయాలకు ఇచ్చేసి తమను డమ్మీలుగా మార్చారని ఆవేదన పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిన నిధుల్ని తిరిగి అందించాలని జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక ఉద్యమాలు, నిరసనలు చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నప్పటికీ, ఈ సమస్య పట్ల ఆయన స్పందించలేదు. ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో తమ నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించిందని, కేసు నమోదు చేయాలని గతేడాది చిత్తూరు జిల్లా సర్పంచులు అప్పటి ఏఎస్పీ శ్రీలక్ష్మికి అర్జీ ఇచ్చారు. చివరికి చేసేదేమీలేక ఆశలు వదులుకున్నారు.

కూటమి అధికారంలోకి వచ్చాక..

ఈ ఎన్నికల్లో వైసీపీ ఓటమిచెందింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రాగానే, అన్ని శాఖల్నీ ప్రక్షాళన చేస్తోంది. ఈ క్రమంలోనే ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు విషయంపై దృష్టి సారించింది. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పవన్ కల్యాణ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర నిధుల్ని గత ప్రభుత్వం మళ్లించడంపై ఆగ్రహించారు. ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఎలా మళ్లిస్తుందని, స్థానిక సంస్థలకు నిధులు ఎందుకు ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశానికి సంబంధించి సమగ్ర నివేదికను అందించాలని సూచించారు. దీంతో ఆర్థిక సంఘం నిధులపై సర్పంచులకు ఆశలు పెరిగాయి. ఇక నుంచి కేంద్రం నుంచి వచ్చే నిధుల్ని అయినా, కూటమి ప్రభుత్వం పంచాయతీ ఖాతాలకు జమ చేస్తుందన్న ఆశావహంతో ఉన్నారు. తద్వారా గ్రామ పంచాయతీలకు మళ్లీ పూర్వ వైభవం రానుందని భావిస్తున్నారు.

నూరురాళ్ల అడవిలో

ఏనుగులు

పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి సమీపంలోని నూరురాళ్ల అటవీప్రాంతంలో శుక్రవారం ఏనుగుల గుంపు హల్‌చల్ చేశాయి. మూడు రోజులుగా పంచాయతీ పరిధిలో సంచరిస్తూ రాత్రి సమయంలో పంటలను నష్టం చేస్తున్న ఏనుగుల గుంపు అటవీప్రాంతానికి చేరుకుంటున్నాయి. గ్రామానికి చెందిన కొందరు యువకులు శుక్రవారం నూరురాళ్ల అటవీప్రాంతం సరిహద్దుకు వెళ్లగా ఏనుగులను గుర్తించి.. తమ మొబైళ్లతో ఫొటోలు, వీడియోలు తీశారు. 11 ఏనుగులు అడవిలో సంచరిస్తూ కనిపించినట్లు చెప్పారు. తమ అరుపులతో ఏనుగులు అటవీప్రాంతం మధ్యలోకి వెళ్లాయని వారు చెప్పారు.

- కల్లూరు



కొనసాగుతున్న జడివాన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 21: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో జడివాన కొనసాగుతోంది. 20 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. చిత్తూరు రూరల్‌లో 21.2మి.మీ, ఎస్ఆర్‌పురం 15..2, బైరెడ్డిపల్లె 11.4, గంగవరం 10.4, పాలసముద్రం 10.2, విజయపురం 9.8, వెదురుకుప్పం 9.4, చిత్తూరు అర్బన్ 9, పెనుమూరు 8.4, యాదమరి 6.6, గుడుపల్లె 6.4, పలమనేరు 5.4, నిండ్ర 5.2, గుడిపాల 5.2, కుప్పం 4.6, గంగాధరనెల్లూరు 4.2, కార్వేటినగరం 4, బంగారుపాళ్యం 3.4, నగరి 3.2, పుంగనూరులో 3 మి.మీ వర్షపాతం నమోదైంది.

సీఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

కుప్పంలో కలెక్టర్ పరిశీలన

కుప్పం, జూన్ 21: కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ఎస్.షన్మోహన్ పరిశీలించారు. చంద్రబాబు ఈనెల 25, 26 తేదీల్లో సొంత నియోజకవర్గమైన కుప్పం పర్యటనకు రానున్న విషయం తెలిసిందే. దీనికి అవసరమైన ఏర్పాట్లను విస్తృతంగా పరిశీలించిన కలెక్టర్, అధికారులకు తగు సూచలను ఇచ్చారు. మొదట పీఈఎస్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అదే కళాశాల ఆవరణలో సమావేశ నిర్వహణకోసం ఆడిటోరియంలో ఏర్పాట్లను చూశారు. ఆర్టీసీ బస్టాండు కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించే అవకాశం ఉన్నందున అక్కడికి చేరుకున్న కలెక్టర్ పుష్పాలంకరణ, ఇతర ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి బస చేయనున్న ఆర్ అండ్ బి అతిథి గృహంలో మొదలైన ఆధునికీకరణ పనులను పర్యవేక్షించారు. ఇక్కడ ప్రజలనుంచి వినతులు స్వీకరించడానికి వీలుగా బ్యారికేడింగ్ నిర్మాణంపై తగు సూచనలు చేశారు. ఇంకా ముఖ్యమంత్రి రెండు రోజుల పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే భవనంలో ముఖ్యమంత్రి బస చేయనున్నందున ఇక్కడ పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ పి.శ్రీనివాసులు, ఆర్ అండ్ బి ఎస్ఈ ఉమామహేశ్వర్‌రెడ్డి, పలమనేరు ఆర్డీవో మనోజ్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనాథ్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, తహసీల్దారు హరికుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం తదితరులు పాల్గొన్నారు. ఇక, శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె వద్ద హంద్రీ నీవా కాలవను సీఎం పరిశీలిస్తారని తెలిసింది. అందుకనే శుక్రవారం ఈ కాలువను కలెక్టర్ పరిశీలించారు.



కుప్పంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

సీఎం పర్యటన ఏర్పాట్లపై నేడు సమీక్ష

చిత్తూరు కలెక్టరేట్: సీఎం చంద్రబాబు రెండు రోజుల కుప్పం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో ముఖ్యమైన శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ షన్మోహన్ సమీక్షించనున్నారు. సీఎం పర్యటన జరిగే ప్రతి కార్యక్రమం వద్ద జిల్లా అధికారులను ఇన్‌చార్జి ఆఫీసర్లుగా నియమించనున్నారు.

చంద్రబాబు పర్యటన ఇలా

తన పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు రెండు రోజులూ కుప్పంలోనే గడపనున్నారు. అధికారిక, పార్టీ కార్యక్రమాల్లో పాలుపంచుకోనున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు.. 25వ తేదీ ఉదయం 11 గంటలకు అమరావతి నుంచి హెలికాప్టరులో బయలుదేరి కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల క్రీడామైదానంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. ఆర్టీసీ బస్టాండు కూడలిదాకా రోడ్ షోలో పాల్గొంటారు. అక్కడ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అక్కడే ప్రజలనుద్దేశించి కాసేపు ప్రసంగిస్తారు. తనకు ఘన విజయం అందించినందుకు ధన్యవాదాలు తెలుపుతారు. అక్కడ్నుంచి పీఈఎస్ ఆడిటోరియం చేరుకుని పార్టీ కార్యకర్తలతో సమావేశమవుతారు. అక్కడే నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమై పార్టీ కార్యక్రమాలపై చర్చిస్తారు. రాత్రి ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు. తిరిగి 26వ తేదీ ఉదయం గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం పీఈఎస్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులతో సమావేశమై జిల్లా అభివృద్ధిపై సమీక్షిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు హెలికాప్టరులో అమరావతికి బయలుదేరుతారు.



ఆరోగ్య 'యోగ'ం

చిత్తూరులో యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రముఖులు

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లాలో అధికారులు, ప్రముఖులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు.ఒత్తిడిని తగ్గించుకోవడానికి, ఆరోగ్య సమస్యలకు యోగా చక్కటి పరిష్కారమని సూచించారు. యోగా అనేది ప్రాచీన భారతీయ జీవన విధానమని, ఇది శరీరానికి, మనసుకు, ఆత్మకు, ఆరోగ్యం, శాంతి, సమతులనం అందిస్తుందని ఎస్పీ మణికంఠ పేర్కొన్నారు. అత్యంత ఒత్తిడితో విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది యోగా చేస్తే ఉపశమనం లభిస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ విద్యార్థుల చేత యోగాసనాలు వేయించారు.శారీరక దృఢత్వం, ఆరోగ్యం, మానసిక స్థైర్యం, ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం లభిస్తాయని విద్యార్థులకు సూచించారు.

- చిత్తూరు

కీలక స్థానాల్లో ...



ఉమ్మడి చిత్తూరు జిల్లా పూర్వ అధికారులకు రాష్ట్రప్రభుత్వంలో మంచి పోస్టింగులు

సీఎస్‌గా నీరబ్... సీఎం కార్యదర్శులుగా రవిచంద్ర, ప్రద్యుమ్న

పలువురు ఇతర అధికారులకు కీలక శాఖల బాధ్యత

తిరుపతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో పనిచేసిన అనేకమంది ఐఏఎస్ అధికారులు ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వంలో కీలక స్థానాల్లో నియమితులయ్యారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నీరబ్ కుమార్ ప్రసాద్ 1998లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 72వ కలెక్టర్‌గా పనిచేశారు. 2008-09 నడుమ జిల్లాకు 78వ కలెక్టర్‌గా వ్యవహరించిన ముద్దాడ రవిచంద్ర ఇపుడు సీఎం చంద్రబాబుకు ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే 2017-19 నడుమ జిల్లాకు 83వ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన పి.ఎస్.ప్రద్యుమ్న సీఎం చంద్రబాబుకు కార్యదర్శిగా పోస్టింగ్ పొందారు. ప్రద్యుమ్న ఈ కీలక బాధ్యతలకు తోడు యువజన సర్వీసులు, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖల ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు కూడా స్వీకరించారు. గతంలో ఉమ్మడి జిల్లా డ్వామా పీడీగానూ, తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గానూ పనిచేసిన ఎం.జానకి, అలాగే ఉమ్మడి జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గానూ, తిరుపతి కమిషనర్‌గానూ పనిచేసిన వాడరేవు వినయ్ చంద్ ఆర్థిక శాఖ కార్యదర్శులుగా నియమితులయ్యారు. 2004లో జిల్లాకు 75వ కలెక్టర్‌గా పనిచేసిన జి.సాయిప్రసాద్ తాజాగా రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2014-17 మధ్య జిల్లాకు 82వ కలెక్టర్‌గా పనిచేసిన సిద్ధార్థ జైన్ ఇపుడు పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా పోస్టింగ్ అందుకున్నారు. గతంలో మదనపల్లె సబ్ కలెక్టర్‌గా పనిచేసిన అహ్మద్ బాబు ప్రస్తుతం ఉద్యాన, ఆక్వాకల్చర్, మత్స్య శాఖల కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇక టీటీడీ ఈవోగా పనిచేసిన అనిల్ కుమార్ సింఘాల్ ఇపుడు మున్సిపల్ పాలనా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఇప్పటి వరకూ తిరుపతి కలెక్టర్‌గా పనిచేసిన ప్రవీణ్ కుమార్ బదిలీపై గనులు, భూగర్భ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ గానూ, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గానూ నియమితులయ్యారు. ఈ నియామకాలతో రాష్ట్రంలో జిల్లా ప్రతిష్ఠ ఇనుమడించడంతో పాటు ఆ మేరకు ప్రాధాన్యత కూడా పెరిగింది.

ప్రద్యుమ్నకు తగిన గుర్తింపు



గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు జేసీగానూ, కలెక్టర్‌గానూ పనిచేసిన పి.ఎస్.ప్రద్యుమ్నకు ఎట్టకేలకు తగిన గుర్తింపు లభించింది. జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే ఆయన రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. అప్పట్లో ఓట్ల లెక్కింపులో అధికార కాంగ్రెస్ పార్టీ తరపున ప్రభుత్వ పెద్దల నుంచీ తీవ్రస్థాయి ఒత్తిళ్లు వచ్చినా ఆయన వెరవకుండా నిజాయితీగా వ్యవహరించడంతో వైసీపీ మద్దతుతో పోటీ చేసిన డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. ప్రభుత్వ పెద్దల మాట ఖాతరు చేయకపోవడంతో ఎన్నికలు ముగిసిన వెంటనే ఆయనను రైతు బజార్ల సీఈవోగా ప్రాధాన్యత లేని పోస్టుకు ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం రావడంతో ఆయన సమర్థతను, నిజాయితీని గుర్తించిన నాటి సీఎం చంద్రబాబు ఏరికోరి సొంత జిల్లాకు కలెక్టర్‌గా నియమించారు. పని చేసింది రెండేళ్ళే అయినా జిల్లాను అనేక అంశాల్లో జాతీయస్థాయిలో ఉత్తమంగా నిలిపారు. 2018లో 2.77 లక్షల మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మల విసర్జన జరగని తొలి జిల్లాగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులకు కూడా ఎక్కారు.అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్, తాగునీరు, టాయిలెట్ సదుపాయాలు కల్పించడంతో పాటు ఫర్నిచర్, టీవీ వంటివి సమకూర్చారు.పల్లె నిద్ర పేరిట ఒకే రోజు జిల్లావ్యాప్తంగా 2 వేల మంది ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అవసరమైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు.మహిళా వర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుని యశోద కార్యక్రమం పేరిట అంగన్వాడీ వర్కర్లకు మెరుగైన శిక్షణ ఇప్పించారు. బంగారుపాలెం నుంచీ నాయుడుపేట వరకూ ఇపుడున్న సిక్స్ లేన్ రోడ్డును ప్రతిపాదించింది ఆయనే.ది బెటర్ ఇండియా సంస్థ 2018లో ఎక్కువ మంది ప్రజల జీవన పరిస్థితులను ప్రభావితం చేసిన పదిమంది స్ఫూర్తిదాయక ఐఏఎస్ అధికారులను గుర్తించగా వారిలో ప్రద్యుమ్న 7వ స్థానం దక్కించుకున్నారు.ఇలాంటి అధికారికి 2019 తర్వాత తగిన గుర్తింపు లేకుండా పోయింది.ప్రాధాన్యత లేని శాఖలు కేటాయించారు. ఇటీవలి ఎన్నికల్లో గెలిచి చంద్రబాబు సీఎం కావడంతో ప్రద్యుమ్న సేవలను తగిన విధంగా వినియోగించుకునేందుకు ఆయన ఏకంగా తన కార్యదర్శిగా నియమించుకోవడం విశేషం.

ఎర బుట్టలతో మామిడిని కాపాడుకోండి

చిత్తూరు (సెంట్రల్), జూన్ 21: ఎర బుట్టలతో ఈగల నుంచి మామిడి పంటను కాపాడుకోవచ్చునని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదనరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోతాపురి, నీలం కాయలు ఇంకా చెట్లపై ఉన్న క్రమంలో ఈగలు ఆశించే వీలుందని, తద్వారా పంట దిగుబడి తగ్గిపోతుందని పేర్కొన్నారు. ఎర బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా ఈగ తెగులు నుంచి పంటను కాపాడుకోవచ్చునని తెలిపారు. ఎకరాకు 8 బుట్టలు సరిపోతాయని, రూ.210 చెల్లించి చిత్తూరు ఉద్యాన శాఖ అధికారి నుంచి పొందవచ్చునని వివరించారు.

కాయలు ఫ్యాక్టరీలకు తరలిస్తే లాభసాటి : రైతులు తోతాపురిని ర్యాంపుల వద్ద కాకుండా నేరుగా ఫ్యాక్టరీలకు తరలించడం ద్వారా టన్నుపై రూ.1,500 అదనంగా పొందవచ్చునని చిత్తూరు ఉద్యాన అధికారి వింధ్య తెలిపారు. ర్యాంపుల్లో కాయలు విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధర రావడం లేదని పేర్కొన్నారు. ఎర బుట్టల కోసం 79950 86961లో సంప్రదించాలని కోరారు.

బిందు సేద్యంతోనే అధిక దిగుబడులు

ఏపీఎంఐపీ జిల్లా పీడీ బాలసుబ్రమణ్యం


బిందు సేద్యం పరికరాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పీడీ బాలసుబ్రమణ్యం

శాంతిపురం, జూన్ 21: బిందు సేద్యం పరికరాల వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కెనమాకులపల్లె పంచాయతీ గడ్డూరు గ్రామం వద్ద శ్రీనివాసులురెడ్డి రైతు పొలంలో అమర్చిన బిందు సేద్యం పరికరాలను ఆయన పరిశీలించారు. వాటి ద్వారా సేద్యం ఎలా చేయాలో రైతులకు అవగాహన కల్పించారు. మట్టిలో పూడిన డ్రిప్ పైపులను ఆమ్లా చికిత్స ద్వారా ఎలా బాగు చేయాలో తెలియజేశారు. స్ర్కీన్ ఫిల్టర్, హైడ్రోసైక్లోన్ ఫిల్టర్‌లను శుభ్రం చేసిన తరువాత నీటిలో కరిగే ఎరువులను ప్రెషర్ గేజ్‌లో 1-2 పాయింట్ల మధ్యలో ఉంచాలన్నారు. అప్పుడు ఎరువులను డ్రిప్‌ల ద్వారా పంపే సమయంలో 1.5 - 2 పాయింట్ల మధ్యలో ప్రెషర్‌లో ఉంచాల న్నారు. అలా చేయడం వల్ల మొక్కకు కావలసినంత ఎరువు చేరుతుందన్నారు. అలాగే పరికరాలు మరమ్మతులకు గురికాకుండా ఉంటాయన్నారు. అలా చేయ కుండా ఎలా పడితే అలా డ్రిప్‌ల ద్వారా మందులు, ఎరువులు వదిలేయడంతో డ్రిప్ పైపులు, ఇతర పరికరాలు దెబ్బతింటాయని తెలియజేశారు. అనంతరం రైతులు బిందు సేద్యం పరికరాలు సబ్సిడీపై కావాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ త్వరలోనే అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఐఏవో సాయి శ్రీనివాస్, ఫినోలెక్స్, నాగార్జున కంపెనీల ప్రతినిధులు, ఇతర రైతులు పాల్గొన్నారు.

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు


ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడి చెట్టు

కల్లూరు, జూన్ 21: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలో మూడు రోజులుగా తిష్టవేసిన ఏనుగులు గుంపు వ్యవసాయ పంటలపై దాడులు కొనసాగుతున్నాయి. దీంతో మామిడి, అరటి, టమోటా, వరి తదితర పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. కోటపల్లి సమీపంలో గురువారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో మామిడిపంటకు అపార నష్టం వాటిల్లింది. కోటపల్లికి చెందిన హంసవేణి మామిడితోటలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు 12 మామిడిచెట్లను విరిచేశాయి. సుమారు టన్ను మామిడికాయలను నేలరాల్చాయి. డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి చెందిన సురేంద్రరాజు, దాము తదితర రైతుల మామిడి చెట్లను విరిచేశాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ కమిటీలన్నీ రద్దు

వెదురుకుప్పం, జూన్ 21: కాంగ్రెస్ పార్టీలో ఉన్న అన్ని కమిటీలను ఈనెల 20వ తేదీ నుంచి పూర్తిగా రద్దు చేసినట్లు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వెదురుకుప్పంలో శుక్రవారం డీసీసీ తాజా మాజీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ ధ్రువీకరించారు.

ఎస్జీబీకి జాతీయ అవార్డు



జ్ఞాపిక స్వీకరిస్తున్న ఎస్జీబీ చైర్మన్ ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 21: సామాజిక భద్రత పథకం అమలులో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక అవార్డు కైవసం చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంతో వరుసగా రెండో ఏడాది అవార్డు దక్కించుకుంది. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఎస్జీబీ చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ డీఎఫ్ఎస్ కార్యదర్శి వివేక్ జోషి చేతులమీదుగా అటల్ పెన్షన్ యోజన వార్షిక అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది అల్టిమేట్ చాంపియన్ షిప్ కప్‌ను కూడా ఆయన స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో ఎస్జీబీ ముందంజలో ఉందని పేర్కొన్నారు.

అయినా.. మారలేదు


నవరత్నాలు పేరు గల ధ్రువపత్రాలు


తవణంపల్లె, జూన్ 21: సచివాలయాల్లో జారీ చేసే సర్టిఫికెట్లలో ప్రభుత్వ ముద్ర మాత్రమే ఉండాలని కొత్త ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా, తవణంపల్లె మండలం అరగొండ సచివాలయంలో శుక్రవారం కూడా రైతులకు ఇచ్చిన వన్‌బీ అడంగళ్ సర్టిఫికెట్‌పై గత ప్రభుత్వ నవరత్నాలు లోగో ఉంది. ఇతర సర్టిఫికెట్లలోనూ మాజీ సీఎం జగన్ ఫొటో ఉన్నట్లు ఆరోపణలున్నాయి. వీటిపై తీవ్ర విమర్శలు తలెత్తాయి. ఇక్కడి ఆర్బీకేకు వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం పేరును అలాగే ఉంచడంపైనా ఆరోపణలు వస్తున్నాయి.

గరుడుడిపై లోకమాత సాక్షాత్కారం

- ముగిసిన అమ్మవారి తెప్పోత్సవాలు


గరుడ వాహనంపై అమ్మవారు

తిరుచానూరు, జూన్ 21: తిరుచానూరు పద్మావతిదేవి తెప్పోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సుప్రభాత మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవ మూర్తిని పద్మసరోవరంలోని నీరాడమండపానికి వేంచేపుచేసి స్నపనతిరుమంజనం నిర్వహించారు. అనంతరం అలంకార శోభితురాలైన అమ్మవారిని తెప్పపై కొలువుదీర్చి పద్మసరోవరంలో ఏడు పర్యాయాలు విహరింపజేశారు. రాత్రి అమ్మవారు గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. దీంతో తెప్పోత్సవాలు ముగిశాయి. అమ్మవారి ఆలయంలో శనివారంనుంచి ఆర్జిత సేవలు యథావిధిగా కొనసాగుతాయని టీటీడీ అధికారులు తెలిపారు.



పుష్కరిణిలో విహరిస్తున్న పద్మావతీదేవి

జీడీనెల్లూరు సీఐకి ఏడాది జైలు

- రూ.పది వేల జరిమానా విధించిన నందికొట్కూరు కోర్టు
- ఎస్ఐగా ఉన్నప్పుడు దాడి ఘటనపై బాధితుడి ప్రైవేటు కేసులో సంచలన తీర్పు


సీఐ శంకర్

గంగాధరనెల్లూరు, జూన్ 21: తనపై ఎస్ఐ శంకర్ దాడి చేశారంటూ బాధితుడు వేసిన ప్రైవేటు కేసులో కర్నూలు జిల్లా నందికొట్కూరు కోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఏడాది జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధించింది. 11 ఏళ్ల కిందటి ఘటనపై గురువారం తీర్పు వెలువరించింది. నాటి ముచ్చుమర్రి ఎస్ఐ శంకర్ (గానాల మారుతీ శంకర్).. ఇప్పుడు గంగాధరనెల్లూరు సీఐగా పనిచేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా పగిడ్యాల మండలం ఘణపురానికి చెందిన తండ్రీ కొడుకులు నాగిరెడ్డి, నరేంద్రరెడ్డికి మధ్య ఆస్తి విషయమై 2013లో తగాదా జరిగింది. ఆస్తి విషయమై తన కుమారుడు దాడి చేశాడంటూ నాగిరెడ్డి ముచ్చుమర్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ శంకర్ అలియాస్ గానాల మారుతీ శంకర్ నరేంద్రరెడ్డిని స్టేషన్‌కు పిలిపించగా విచారణకు సహకరించలేదనే కారణంతో కొట్టారు. తనను ఎస్ఐ కొట్టారంటూ అప్పట్లో బాధితుడైన నరేంద్రరెడ్డి సీఐ, డీఎస్పీ, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా.. అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఎస్ఐ శంకర్‌పై అప్పట్లోనే బాధితుడు ప్రైవేటు కేసు వేశారు. ప్రస్తుతం నందికొట్కూరు జూనియర్ సివిల్‌కోర్టులో విచారణ జరిగింది. ఆ కేసుకు సంబంధించి అప్పటి ఎస్ఐ.. ఇప్పుడు గంగాధరనెల్లూరుగా సీఐగా పనిచేస్తున్న శంకర్‌కు ఏడాది జైలుశిక్షను విధిస్తూ జడ్జి దివ్య గురువారం తీర్పునిచ్చారు. దాంతో పాటు రూ.10వేల జరిమానా కూడా విధించారు. కోర్టు తీర్పు ఉత్తర్వులు జిల్లా ఎస్పీతో పాటు గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌కు చేరినట్లు సమాచారం. దీనిపై వివరణకు సీఐని సంప్రదించడానికి ప్రయత్నించగా.. ఫోను స్విచ్ ఆఫ్‌లో ఉంది.

సదుం ఎంపీపీ మృతి


ఎల్లప్ప (ఫైల్ ఫొటో)

సదుం, జూన్ 21: సదుం ఎంపీపీ ఎల్లప్ప(70) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. నడిగడ్డ పంచాయతీ చిచ్చిలివారిపల్లెలోని తన స్వగృహంలో శుక్రవారం వేకువజామున గుండెపోటుకు గురయ్యారు. కుటుంబసభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వైసీపీలో క్రియాశీలకంగా ఉన్నారాయన. విజయవాడలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం అయిన వెంటనే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సదుంకు చేరుకుని ఎల్లప్ప మృతదేహానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబీకులను పరామర్శించారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, వైసీపీ నేతలు పెద్దిరెడ్డి, ఇందిరమ్మ, వేణుగోపాల్ రెడ్డి, సుధీర్‌రెడ్డి, మండల పరిషత్ సిబ్బంది, పలువురు ఉద్యోగులు ఎల్లప్ప మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సంతాపం తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

వెంకటాపురంలో అతిసారం

ఆస్పత్రికి పరుగులు తీసిన బాధితులు ● గ్రామంలో వైద్య శిబిరం


గుడుపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటాపురం గ్రామస్థులు

గుడుపల్లె, జూన్ 21: గుడుపల్లె మండలం వెంకటాపురం గ్రామంలో అతిసారంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం గ్రామంలో కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. మధ్యాహ్నం తర్వాత మరికొందరు అస్వస్థతకు గురయ్యారు. దీంతో భయపడిన బాధితులు తులసమ్మ(40), రమేష్(43), కొందరు కుప్పం ప్రైవేటు ఆసుపత్రిలో రాహుల్ రాయ్(6), గీతాంజలి(8), చంద్రప్ప(45) కుప్పం ఏరియా ఆస్పత్రికి, రామక్రిష్ణప్ప(62), రాజేశ్వరి(55), శ్యామల (28), సంజన(7) గుడుపల్లె పీహెచ్‌సీకి వెళ్లారు. దేవేంద్ర(21), వెంకటలక్ష్మి(62), లక్ష్మమ్మ(42), వనజాక్షి(40), సందీప్(9) తదితరులు గ్రామంలో వైద్య శిబిరంలో చికిత్స చేసుకొన్నారు. అస్వస్థతకు గురైన వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రానికల్లా ప్రమాదం లేదని వైద్యులు తెలపడంతో అందరూ తమ ఇళ్లకు చేరుకొన్నారు. వెంకటాపురం గ్రామంలో అతిసారం విషయం తెలిసిన వెంటనే గుడుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డెల్ఫిన్ ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ రాజ్ అధికారులు, సర్పంచ్ నారాయణ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి గ్రామస్థులకు పలు ఆరోగ్య జాగ్రత్తలను తెలిపారు. సర్పంచ్ త్రాగు నీటి ట్యాంకులకు క్లోరినేషన్ చేసారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుసూదన్, డీఈ పురుషోత్తం గ్రామంలోకి చేరుకొని నీటిని తీసుకొని పరీక్ష కోసం తిరుపతి ల్యాబ్‌కు పంపారు. ఆ తరువాత గ్రామంలో శుద్ధ నీటిని ట్యాంకర్ ద్వారా ప్రజలకు అందించారు.

ఫుడ్ పాయిజన్‌తో మరో 15 మందికి అస్వస్థత


చికిత్స పొందుతున్న బాధితులు

పాలసముద్రం, జూన్ 21: పాలసముద్రం గంగజాతరలో ఫుడ్ పాయిజనై 150 మంది అస్వస్థతకు గురైన విషయం విదితమే. శుక్రవారం కూడా 15 మంది పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందారు. వీరికి జ్వరం, విరేచనాలు అవుతుండడంతో వైద్యులు చికిత్సలు చేశారు. ఏపీడీ డాక్టర్ శ్రీవాణి నేతృత్వంలోని డాక్టర్ల బృందం శుక్రవారం కూడా గ్రామంలో పర్యటించారు. తాగునీరు కలుషితం కాలేదని, జాతర సందర్భంగా సమర్పించిన అంబలిలో పాయిజనింగ్ అయి ఉంటుందని తెలిపారు. ఆ అంబలి శాంపిల్‌ను తిరుపతి రుయాస్పత్రి ల్యాబ్‌కు పంపించామన్నారు. డాక్టర్ మోహనక్రిష్ణ, తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీవో రామనాథ రెడ్డి, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్వైజర్ మురళి, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డిపై డీజీపీ, సీఐడీలకు ఫిర్యాదు

టీటీడీ పూర్వ ఈవో అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ కోరిన తిరుపతివాసి

తిరుపతి, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పూర్వ ఈవో, ప్రస్తుత అదనపు ఈవో ధర్మారెడ్డిపై డీజీపీ, సీఐడీ అదనపు డీజీపీలకు తిరుపతి శ్రీనివాసపురానికి చెందిన చెందిన ఎం.రామచంద్రనాయుడు ఫిర్యాదు చేశారు. ధర్మారెడ్డి ఉద్దేశపూర్వకంగా చేసిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.టీటీడీ ఈవోగా ఆయన పనిచేసిన కాలంలో భక్తుల నుంచీ వచ్చిన డబ్బును, ప్రొటోకాల్ పేరుతో దర్శనాలను దుర్వినియోగం చేశారని, వైసీపీకి అనుకూలంగా వ్యక్తులను, వ్యవస్థలను మేనేజ్ చేసి శ్రీవారి పవిత్రతకు భంగం కలిగించారని ఆరోపించారు. శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన డబ్బును దారి మళ్లించారన్నారు. సమరసత సేవా ఫౌండేషన్‌కు, టీటీడీకి నడుమ జరిగిన ఆర్థిక లావాదేవీలపై విచారణ జరపాలని కోరారు. ఇంజనీరింగ్ బడ్జెట్ ద్వారా అవసరం లేకున్నా కమీషన్ల కోసం వేల కోట్ల రూపాయలు మంచినీళ్ళప్రాయంగా ఖర్చు చేసి కొన్ని టెండర్ల రూపంలో, మరికొన్ని నామినేషన్ రూపంలో మంజూరు చేసిన పనులమీద, వాటి నాణ్యత మీద విచారణ చేపట్టాలని కోరారు. అత్యవసరం పేరిట శానిటేషన్, ఇతర పనులు నామినేషన్‌పై చేసిన పనులన్నింటిపై దర్యాప్తు చేయాలని అభ్యర్థించారు. లడ్డూ ప్రసాదాల కోసం, అన్న ప్రసాదాల కోసం నాణ్యత లేని సరుకులు కొనుగోలు చేయడంపైన, వాటి ధరలు, నాణ్యతపైన విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. ప్రోటోకాల్ లేని వారికి కేటాయించిన సేవా టికెట్లపై కూడా విచారణ జరపాలని కోరారు. వీఐపీ, వీవీఐపీ ప్రోటోకాల్‌లో వున్నవారిని, లేని వారిని కూడా శ్రీవారి సన్నిధిలో తరింపజేసి తద్వారా వైసీపీ అధినాయకులకు అనుకూలంగా పనులు చేయించిన దానిపై లోతుగా దర్యాప్తు జరపాలని కోరారు. తిరుమలలో ఎవరికీ లేని విధంగా విశాఖ స్వరూపానంద ఆశ్రమానికి భవన నిర్మాణానికి అనుమతులు జారీ చేయడంపైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని విభాగాలలో తనకు అనుకూలంగా వున్న వారిని సలహాదారులుగా నియమించుకోవడంపైన, వారికి చెల్లించిన జీతభత్యాలపైన సమగ్ర విచారణ జరపాలని తనను టీడీపీ రాష్ట్ర నాయకుడుగా పేర్కొంటూ ఎం.రామచంద్రనాయుడు లిఖిత పూర్వక ఫిర్యాదులు చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నెరవేరిన చంద్రబాబు శపథం


ఎన్టీఆర్ కూడలిలో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

వి.కోట, జూన్ 21: ముఖ్యమంత్రిగా చంద్రబాబు అసెంబ్లీలో అడుగు పెట్టగానే వి.కోటలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసు కున్నాయి. ఈ కౌరవ సభలో ఉండలేనని మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడతానని 2021 నవంబరులో చంద్రబాబు శపథం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆయన ఇంతవరకు అసెంబ్లీలో అడుగుపెట్టలేదు. ఈ క్రమంలో ఆయన మళ్లీ గెలుపొంది ముఖ్యమంత్రిగా శుక్రవారం సభలో అడుగు పెట్టడంతో తెలుగు తమ్ముళ్ల సంబరాలు అంబరాన్నంటాయి. మండల టీడీపీ అధ్యక్షులు రంగనాథ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, నేతలు చౌడప్ప, రాంబాబు, సుబ్బన్న, శబరీష్, నారాయణస్వామి, సర్పంచులు విశ్వనాథ్, ప్రవీణ్ కుమార్, శివ, నాయకులు రెడ్డి భాస్కర్, భక్తా, హరినాథరెడ్డి, నాగభూషణం, విశ్వనాథ రెడ్డి, జనార్దన్‌రెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, చంద్రబాబు, మురుగేష్, యాసీర్, షేక్ ఉమ్మర్, శివకుమారి, గౌస్‌పీర్, ఆరీఫుల్లా, మునిరత్నం ఉన్నారు.

కార్యకర్తలకు తోడుగా ఉంటాం: టీడీపీ

వి.కోట, జూన్ 21: తెలుగుదేశం పార్టీకి, కూటమి ప్రభుత్వానికి అఖండ విజయాన్ని అందించిన ఘనత కార్యకర్తలకే దక్కిందని వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని టీడీపీ మండల అధ్యక్షుడు రంగనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక పీఎంఆర్ కళ్యాణ మండపంలో అన్ని పంచాయతీల కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అందరికీ అభినందనలు తెలియజేశారు. పంచాయతీల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, జిల్లా అధికార ప్రతినిధులు చౌడప్ప, రాంబాబు, సోమశేఖర్, శబరీష్, విశ్వనాథ్, సుబ్బన్న, భక్తా, నారాయణస్వామి, జనార్థన్‌రెడ్డి, సతీష్, మహేష్‌రెడ్డి అన్ని పంచాయతీల నేతలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మామపై అల్లుడి దాడి.. కేసు నమోదు

పుంగనూరు రూరల్, జూన్21: కుమార్తెను ఇచ్చి పెళ్లి చేసిన మామపై అల్లుడు దాడి చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు.. పట్టణ సమీపంలోని మంగళం కాలనీకి చెందిన నజీర్ తన కుమార్తెను అదే ప్రాంతానికి చెందిన ఇంతియాజ్‌కు ఇచ్చి పెళ్లి చేశాడు. ఇటీవల ఇంతియాజ్ తన భార్య సాధికాత్‌ను కొట్టాడు. ఈ విషయనిఖ్ల ఆమె తండ్రి నజీర్, అన్నయ్య మహ్మదాలి దృష్టికి తీసుకెళ్లింది. దీంతో వారు అల్లుడైన ఇంతియాజ్‌ను మందలించారు. అయితే అతడు మామ నజీర్, బావమరిది మహ్మదాలిపై దాడిచేసి గాయపరిచాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

'ప్రభుత్వ జూనియర్ కాలేజీ పుంగనూరు' సినిమా విడుదల


సినిమా విడుదల సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న యూనిట్ సిబ్బంది

పుంగనూరు రూరల్, జూన్21: 'ప్రభుత్వ జూనియర్ కాలేజీ పుంగనూరు 500143' సినిమాను పుంగనూరులో సినిమా యూనిట్ సిబ్బందితో కలసి ఆ సినిమా దర్శకుడు శ్రీనాథ్ విడుదల చేశారు. శుక్రవారం స్థానిక వెంకటేశ్వర థియేటర్ ఆవరణలో కేక్‌కట్ చేసి ప్రేక్షకుల మధ్య సినిమాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మంచి సందేశాన్ని అందించడయే సినిమా లక్ష్యమన్నారు. నాలుగేళ్లుగా పుంగనూరు పరిసరాల్లో షూటింగ్ చేసినట్లు తెలిపారు. డైరెక్టర్ ఊలపాడు శ్రీనివాసులు అప్పిరెడ్డి, డాక్టర్ ప్రభాకర్, డ్యాన్స్ మాస్టర్ కిరణ్, మ్యూజిక్ డైరెక్టర్ సుధాకర్, జెమిని, ప్రసాద్‌రావు, ప్రసాద్‌స్వామి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో ప్రజా పాలన : జనసేన


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

రామకుప్పం, జూన్ 21: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వంలో ప్రజా పాలన అందుతుందని మండల జనసేన అధ్యక్షుడు హరీష్ పేర్కొన్నారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ ప్రమాణశ్వీకారం చేసిన సందర్భంగా రామకుప్పంలో జనసేన పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పవన్ కల్యాణ్‌ను అసెంబ్లీ గేట్ కూడా తాకనివ్వబోమని లేదని ప్రగల్భాలు పలికిన ఏ ఒక్క మంత్రి గానీ, శాసనసభ్యుడు గానీ ప్రస్తుతం శాసన సభలో కనిపించకుండా పోయారని గుర్తుచేశారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు బాధ్యతగా నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు శ్రీకాంత్, పవన్, భాస్కర్, గంగాధర్, సురేష్, మునిరాజు, హరీష్, వినోద్, గజేంద్ర, మహేష్, సుబ్రమణ్యం, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

బిందుసేద్యంపై రైతులకు అవగాహన


రైతులకు బిందు సేద్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామకుప్పం, జూన్ 21: గొరివిమాకులపల్లె పంచాయతీ చిన్నగెరిగపల్లె గ్రామంలో బిందుసేద్యంపై జిల్లా ఏపీఎంఐపీడీ బాల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. బిందుసేద్య పరికరాల వినియోగంతో తక్కువ నీటితో ఎక్కువ సాగు చేయవచ్చునని తెలిపారు. రైతులకు పొలంలో అమర్చిన బిందు సేద్యం పరికరాలపై అవగాహన కల్పించి వాటి యాజమాన్యాన్ని తెలియజేశారు. డ్రిపి యాజమాన్యంలో భాగంగా స్క్రీన్ ఫిల్టర్‌ను హైడ్రోసైక్లోన్‌ను శుభ్రం చేయడం గురించి తెలియజేశారు. అలాగే రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తిచేశారు. ఈ కార్యక్రమంలో డ్రిప్ కంపెనీ ప్రతినిధులు రైతులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 21: రాష్ట్రంలో టీడీపీ ఘన విజయం సాధించి. పార్టీ అధినేత చంద్రబాబు సీఎం కావవడంతో రామకుప్పం మండలానికి చెందిన పలువురు నేతలు శుక్రవారం తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైలో గిరి ప్రదర్శన చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మనోహర్ నేతలు మోహన్‌శంకర్, గిరిదాసు, వేణు, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీహోమం



చౌడేపల్లె, జూన్21: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రీతికరమైన చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ఆశీర్వద మండపంలో కలశస్థాపన చేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూల మంత్రాన్ని భక్తులచే పఠింపజేసి సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం చండీహోమాన్ని భక్తులచే ఆచరింపజేశారు.

నూతన నాయకత్వాన్ని ప్రోత్సహిద్దాం

- వైసీపీ నాయకులకు సహకారం వద్దు
- కుప్పం మండల టీడీపీ సమావేశంలో తీర్మానం


సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎం

కుప్పం, జూన్ 21: ఎన్నికల్లో బాగా కష్టపడి, ప్రజల్లోనే నిరంతరం ఉంటూ పార్టీ విజయంకోసం కృషి చేసిన నూతన నాయకాన్ని ప్రోత్సహించాలని, అధికార గర్వంతో విర్రవీగిన వైసీపీ నాయ కులకు టీడీపీ శ్రేణుల నుంచి ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ ఎటువంటి సహాయ సహకారాలు అందించరాదని టీడీపీ రూరల్ మండల సమావేశం తీర్మానించింది. కుప్పంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ ఆత్మీయ సమావేశం జరిగింది. టీడీపీ నియోకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ తదితర పార్టీ ప్రముఖుల సమక్షంలో ఈ సమావేశం జరిగింది. అధినేత చంద్రబాబుకు ఓట్లేసి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు. తర్వాత నాలుగు తీర్మానాలను ఆమోదించారు. ఈ నెల 25, 26 తేదీలలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని, ఆ సమయంలో తీర్మానాల ప్రతిని ఆయనకు అందించాలని నిర్ణయించారు.

ఆమోదించిన తీర్మానాలు ఇవే..

1. పార్టీ బలోపేతం చేసేందుకు విస్తృతంగా సేవలు అందించాలి. అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ కార్యకర్తలను, నేతలను వేధించిన కరుడుగట్టిన వైసీపీ నాయకులకు బంధుత్వం పేరుమీదో, స్నేహం, కులం పేరుమీదో పార్టీనుంచి ఎవరూ సహాయసహకారాలు అందించరాదు. అతిక్రమించి ఎవరైనా అలా చేస్తే, వారిని పార్టీనుంచి బహిష్కరించాలి.
2. పార్టీకోసం కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు, ఇతరత్రా పదవులు ఇచ్చి అన్ని స్థాయిలలో నూతన నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. ముఖ్యంగా యువతను పరిగణనలోకి తీసుకోవాలి. గతంలో నామినేటెడ్ పదవులను అనుభవించిన వారికి వ్యక్తిగతంగా తోడ్పడాలి.
3. జనాభా ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలి. అన్నివర్గాల నుంచి నిష్పక్షపాతంగా సమాచారం సేకరించి, ఉన్నత విలువలు, సంస్కార వంతులైన నాయకులను, కార్యకర్తలను మాత్రమే ప్రోత్సహించాలి.
4. పార్టీ శ్రేయస్సును పక్కనపెట్టి కుల రాజకీయాలు చేసేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలి.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వలంటీర్


ఆక్రమిత భూమిలో నిర్మాణాల కోసం సిద్ధం చేసిన రాళ్లు

శాంతిపురం, జూన్ 21 : కడపల్లె రెవిన్యూ పరిధిలోని బీఎం.గొల్లపల్లె వద్ద సర్వే నెంబర్ 191లో 3.65 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 2.70 ఎకరాలను బీఎం.గొల్లపల్లెకు చెందిన వలంటీర్ కుమార్ ఆక్రమించాడని కడపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మరాజుపల్లె, అడ్డవంక, బీఎం గొల్లపల్లె, శ్యామరాజుపురం, బీరనకుప్పం, ఎదురగుట్టపల్లె గ్రామస్తులు ఈ నెల 13న తహసీల్దార్ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ స్పందిస్తూ విచారణ చేపట్టాలని వీఆర్‌వోను ఆదేశించారు. ఆక్రమణ వాస్తవమేనని వీఆర్‌వో తహసీల్దార్‌కు నివేదిక అందించారు. ఆ మేరకు ప్రభుత్వ భూమి వదిలేయాలని వలంటీర్‌కు నోటీసులు జారీచేశారు. అయితే వలంటీర్ ఆక్రమణలు ఆపలేదు. దీంతో గ్రామస్తులు ఈ నెల 15న మళ్లీ తహసీల్దార్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు తహసీల్దార్ రాళ్లబూదుగూరు ఎస్ఐ సుమన్‌కు ఆక్రమణదారుడిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు అతడిని పిలింపిచి హెచ్చరించారు. అయితే వలంటీర్ మాత్రం ఆ భూమిని చదును చేస్తుండడంతో ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోకపోతే రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు



సోమల, జూన్ 21: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయడంతో పెద్దఉప్పరపల్లె టీడీపీ నాయకులు సంబరాలు చేపట్టారు. బాణ సంచాలు పేల్చి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, వినోద్ కుమార్, నరసింహయాదవ్, రంగయ్యశెట్టి, రెడ్డెప్ప నాయుడు, వెంకట్రామయ్య, గిరి రాయల్, రఫీ, త్యాగ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్లో విద్యాసామగ్రి పంపిణీ


మోడల్ స్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రామకుప్పం, జూన్ 21: సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిస్వామి, పార్టీ అధ్యక్షులు ఆనందరెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి పత్ర నారాయణ, ప్రధాన కార్యదర్శి నరహింహులు, మాజీ ఎంపీపీలు ఆంజినేయరెడ్డి, చిన్నక్రిష్ణ తెలిపారు. శుక్రవారం వారు రామకుప్పం ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, రామమూర్తి, మహ్మద్ రఫీ, పెరుమాల్, కేశవరెడ్డి, అవినాష్, జ్ఞానశేఖర్, మునిరెడ్డి, ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, జూన్21: పుదిపట్లలో వెలసిన వైష్ణవి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మ వారికి పంచామృతాభిషేకాలు చేసి అమ్మవారిని ప్రత్యే కంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే నాగకాల భైరవ స్వామి, ఆంజనేయ స్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్ కుమార్ రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అనధికార నియామకాలను రద్దు చేయండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్లు దాము, తదితరులు

కుప్పం, జూన్ 21: కుప్పం పురపాలక సంఘంలో అనధికారికంగా నియమించిన 16 మంది అవుట్ సోర్సింగ్ నియామకాలను రద్దు చేయాలని టీడీపీ మున్సిపల్ కౌన్సిలర్లు కలెక్టర్ షన్మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శుక్రవారం వారు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ 16 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది కాకుండా, మున్సిపాలిటీలో మరో 126 మంది సిబ్బంది ఆప్కాస్ ద్వారా కొనసాగుతున్నారని వివరించారు. వీరి జీతభత్యాలకోసం ప్రతినెలా రూ.30 లక్షలు వ్యయం అవుతోందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపాలిటీ ఆదాయం అంతలేనందున అవసరమైన సిబ్బందిని మాత్రమే ఉంచుకుని మిగిలినవారి నియామకాలు రద్దు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దాము, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను జయప్రదం చేద్దాం


పోలీసు అధికారులకు సూచనలిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

గంగవరం, జూన్ 21: ఈ నెల 29న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి కక్షిదారులు, పోలీసులు కలసికట్టుగా కృషిచేయాలని పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణంలో పలమనేరు డీఎస్పీ, పోలీ సులతో కలిసి లోక్‌అదాలత్ నిర్వహణపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్, సీఐలు చంద్రశేఖర్, చిన్నగోవిందు, పలువురు సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న వోల్వో బస్సు


ప్రమాదంలో గాయపడిన కూలీలు

గంగవరం, జూన్ 21: పలమనేరు-బెంగళూరు రహదారిలో పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద ఆటోను వోల్వో బస్సు ఢీకొన్న సంఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... బైరెడ్డిపల్లి మండలం బెల్లంమడుగు గ్రామానికి చెందిన ఏడుగురు కూలీలు, గంగవరం మండలం కీలపట్ల సమీపంలో మామిడితోటలో మామిడికాయలను కోయడానికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా నాగమంగళం వద్ద వెనుక నుంచి వస్తున్న వోల్వో బస్సు ఢీకొంది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో 108 సిబ్బంది వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవధాన్య అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, జూన్21: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం నవధాన్య అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

హంద్రీ-నీవా కాలువ పరిశీలన

శాంతిపురం, జూన్ 21 : మండల పరిధిలోని గుండిశెట్టిపల్లె వద్ద హంద్రీ-నీవా కాలవను కలెక్టర్ షన్మోహన్ శుక్రవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 25, 26వ తేదీలలో కుప్పంలో పర్యటించనున్నారు. ఆ పర్యటనలోనే గుండిశెట్టిపల్లె వద్ద హంద్రీ-నీవా కాలవను పరిశీలించనున్నారని తెలిసింది. దీంతో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించేందుకు కుప్పం వెళుతున్న కలెక్టర్ గుండిశెట్టిపల్లె వద్ద కుప్పం కెనాల్‌ను పరిశీలించారు.

గ్రామాల్లో కక్ష సాధింపులు వద్దు : టీడీపీ


నాయకులను సన్మానిస్తున్న కొలమడుగు పంచాయతీ కార్యకర్తలు

శాంతిపురం, జూన్ 21: గ్రామాల్లో కక్ష సాధింపులు వద్దని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండల పార్టీ కార్యాలయంలో పచాయతీ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇంచార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. అలాగే అధికారం వచ్చిందని గ్రామాల్లో కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని కార్యకర్తలకు సూచించారు. అలా చేస్తే వైసీపీ వాళ్లకు, మనకు పెద్ద తేడా ఉండదని తెలియజేశారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని కోరారు. అనంతరం విశ్వనాథనాయుడు, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి విజయరామిరెడ్డి, రాళ్లబూదు గూరు క్లస్టర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నేత నారాయణరెడ్డి, శివకుమార్, వెంకటపతిలను కొలమడుగు పంచాయతీ రెడ్లపల్లె గ్రామానికి చెందిన కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంజునాథరెడ్డి, జయారెడ్డి, శివశంకర్‌గౌడు, రమేష్, మంజునాథ్, మురుగేష్, రాజారెడ్డి, బీరప్ప, గణేష్, మురుగేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు రూరల్, జూన్21: ముగ్గురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..మండలంలోని ఈడిగపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడిచేశారు. ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15790లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

బాటగంగమ్మకు విశేషపూజలు

బైరెడ్డిపల్లె, జూన్ 21: బైరెడ్డిపల్లెలోవున్న బాట గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అర్చకులు నాగేంద్రప్రసాద్ అమ్మ వారికి అభి షేకం చేశారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా అవసరం

గుడుపల్లె, జూన్ 21: మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమని ద్రావిడ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మధుజ్యోతి తెలిపారు. ద్రావిడ వర్సిటీలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యోగా సెంటర్ కన్వీనర్ సీడీఎల్‌పీ శాఖాధ్యక్షులు ఆచార్య ఎన్ సుశీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా భారతీయ సంప్రదాయ జీవన విధానంలో ఒక భాగమని తెలిపారు. కుప్పానికి చెందిన బ్రహ్మకుమారీస్ రాజయోగిని అందరితో ధ్యానం చేయించారు. యోగా మాస్టారు గణేష్ యోగసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మాధవనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుప్పం: కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో యోగా శిక్షకులు వైద్యులకు, విద్యార్థులకు వివిధ రకాల యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు, వివిధ విభాగాల అధిపతులు, పాల్గొన్నారు.

● **కేఈసీలో:** కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో యోగా శిక్షకులచే యోగాసనాలు అభ్యాసం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్, కేఈసీ వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సునీల్‌రాజ్ తదితరులు యోగా శిక్షకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేఈసీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. ● కుప్పంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మహబూబ్ బాషా, ప్రధానోపాధ్యాయురాలు కుమారి, కేశవులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్.తులసీనాథ్, గుడుపల్లె మండల అధ్యక్షుడు టి.రామచంద్రుడు, బీజేవైఎం అధ్యక్షుడు పవన్ కుమార్ పాల్గొన్నారు.

పుంగనూరు: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు.

చౌడేపల్లె: స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్స్‌పాల్ జయప్రకాష్ యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ బాలాజి, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, యశోద, సురేష్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సోమల: సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌతమ్, అధ్యాపకులు శివయ్య, నాగరత్న పాల్గొన్నారు.

కల్లూరు: నందనవనం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తులసిరాం, కల్లూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీవాణి ఆధ్వర్యంలో యోగా ప్రాముఖ్యతను వివరించారు.

బైరెడ్డిపల్లె: కమ్మనపల్లె కస్తూర్బా పాఠశాలలో నిర్వహించిన యోగా డేకి ఏపీవో వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి యోగా ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో ఇంద్రాణి, యోగా మాస్టర్ దేవరాజులునాయుడు, పాఠశాల ఎస్వో స్వరూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● కడపనత్తం జడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులను పాఠశాల హెచ్ఎం నందగోపాల్‌రెడ్డి, పీడీ చిరంజీవి, ఉపాధ్యాయులు అభినందించారు. ● బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ విజయచందర్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

పెద్దపంజాణి: నాగిరెడ్డిపల్లె పాఠశాలలో హెచ్ఎం బాబురెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు యోగా రూపంలో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

గంగవరం: యోగాతో ఆరోగ్యకర జీవనాన్ని సాగించవచ్చని పలమనేరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి లిఖిత పేర్కొన్నారు. జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు చేపట్టారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సదుం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా గురువు రమేశ్ విద్యార్థులతో ఆసనాలు వేయించారు.

శాంతిపురం: పరమహంస యోగానంద విద్యాలయ చైర్మన్ అగర్వాల్, యోగా గురువులు శుద్ధనందజి, స్వామి నిరంజనానంద్ ఆధ్వర్యంలో పరమహంస యోగానంద విద్యాలయంలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. కౌన్సిల్ మెంబర్లుగా ఎన్నికైన విద్యార్థులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆజాద్ హుస్సేన్, పాఠశాల కమిటీ మెంబర్ చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.







కడపనత్తం పాఠశాలలో యోగా విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు, కేఈసీలో యోగాసనాలు వేస్తున్న జీసీఎం, పలమనేరు కోర్టులో కోర్టు సిబ్బంది, న్యాయవాదుల యోగాసనాలు, సమావేశంలో మాట్లాడుతున్న ద్రవిడ వీసీ ఆచార్య మధుజ్యోతి, సదుంలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ బడుల పరిరక్షణ అందరి బాధ్యత


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఐరాల(కాణిపాకం), జూన్ 21: ప్రభుత్వ బడుల పరిరక్షణ అందరి బాధ్యతని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు అన్నారు. శుక్రవారం కాణిపాకం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దాం కరపత్రాలను ఆవిష్కరించారు. సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడూ పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. చదువు, సంస్కారం, నైతిక విలువలు, దేశభక్తి, సమానత్వ భావనలు నేర్పేది ప్రభుత్వ బడిలోనే అన్న విషయాన్ని తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేద్దాం



ఐరాల(కాణిపాకం), జూన్ 21: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లేబర్ అధికారి ఆనంద్‌బాబు కోరారు. మండలంలోని పొలకల సంతగేటులో శుక్రవారం చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బడి మానేసిన పిల్లలను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. చదువు విలువను వారి తల్లిదండ్రులకు వివరించి పిల్లలను పాఠశాలకు పంపేలా చూడాలన్నారు. ఏఎస్ఐ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, జూనియర్ అసిస్టెంట్ దినేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ బాబు, మహిళా పోలీసు శ్వేత పాల్గొన్నారు.

పర్సనల్ ఇన్‌చార్జులను నియమించాలి

నగరి జూన్21: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పర్సనల్ ఇన్‌చార్జులను నియమించాలని చిత్తూరు జిల్లా సహకార సంఘం గౌరవాధ్యక్షుడు తులసిపిళ్లై, అధ్యక్షుడు విజయకుమార్‌లు డిమాండ్ చేశారు. నగరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో జిల్లాలో 37 సహకార సంఘాలకు గాను 11 సంఘాలకు మాత్రం పర్సనల్ ఇన్‌చార్జులున్నారని, మిగిలిన 26 సంఘాలకు లేకపోవడంతో వ్యాపార లావాదేవీలు పూర్తిగా స్తంభించాయని తెలిపారు. దీనిపై దృష్టి సారించాలని కోరారు. సంఘం నాయకులు వి.ఎస్.విజయకుమార్‌రెడ్డి, బి.రమేష్, జి.సుబ్రమణ్యం నాయుడు, సురేంద్రనాయుడు, రామమూర్తి పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ సేవలో భానుప్రకాష్



నగరి జూన్21: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం ఉదయం విజయవాడ కనకదుర్గమ్మను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వేదపండితుల ఆశీర్వాదం తీసుకుని శాసనసభ సమావేశాలకు వెళ్లారు.

పులిగుండులో గిరి ప్రదక్షిణ


శేష వాహనంపై పార్వతీపరమేశ్వర్లు

పెనుమూరు, జూన్ 21: పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని పులిగుండు శివాలయంలో శుక్రవారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి వారికి అభిషేకాలు చేశారు. పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై కొత్తరోడ్డు, రాణావేణుగోపాలపురం, సీఎస్.అగ్రహారం మీదుగా ఊరేగించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

డ్యాకుమెంటు దారిపోయినది

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా కక్షిదారుడైన శ్రీ ఎస్.రామాంజనేయులు, S/o అశ్వర్థ నారాయణ, డి.నెం.21-775, సి.సి.ఎస్.కాలనీ, చిత్తూరు కు చెందిన ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ పత్రము డాక్యుమెంటు నెం.2639/2008(చిత్తూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్) కట్టమంచి నుండి చిత్తూరుకు వస్తున్న సందర్భంగా దారిపోయినది. ఈ విషయమై చిత్తూరు 1 టవున్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసి ఉన్నాము. 1 టవున్ పోలీస్ వారు దారి పోయినట్టు సర్టిఫికేట్ కూడా జారీ చేసి ఉన్నారు. ఈ డాక్యుమెంటు చిత్తూరు జిల్లా, చిత్తూరు మునిసిపాలిటీకి చేరి 76 కట్టమంచి గ్రామ లెక్క దాఖల సర్వే నెం.260.1 విస్తీర్ణం ఎ.0.77 సెంట్లు గల భూమిలో ప్లాటు నెం.2గా ల ఇంటి ఖాళీ జాగాకు చెందిన ఆస్తి. కావున సదరు పత్రములు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది చిరునామాలోగాని లేక పై పేర్కొన్న నా కక్షిదారు చిరునామాలో గాని అందజేయగలరు.

ఎ.దేవేంద్రనాథ్
అడ్వకేట్,చిత్తూరు. సెల్ : 9440827778

వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

చిత్తూరు రూరల్, జూన్ 21: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జూలై 24 నుంచి 26వ తేదీ వరకు హార్సిలీ హిల్స్‌లో జరగనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని యూనియన్ గౌరవాధ్యక్షుడు నాగరాజు కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ పార్కులో ఏఐటీయూసీ నాయకులతో ఆయన సమావేశమై పలు విషయాలపై చర్చించారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నేడు సీతారాముల కల్యాణం

గుడిపాల, జూన్ 21: మండలంలోని ఏఎల్ పురంలో శనివారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ గుర్రప్ప నాయుడు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారంతో రైతుల్లో ఆనందం

గుడిపాల, జూన్ 21: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావడం, వర్షాలు కురవడం, అమరావతి పనులు ప్రారంభం కావడం, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్ మంజూరు చేసేందుకు సిద్ధమవడం వంటి పనులతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు.

భానుప్రకాష్‌కు సన్మానం



విజయపురం, జూన్ 21: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను టీడీపీ మండల నాయకులు శుక్రవారం అమరావతిలో సన్మానించారు. అందరూ కష్టపడి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండలాధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి వితరణ



విజయపురం, జూన్ 21: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆలపాకం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం టీడీపీ నేత శరవణ విద్యాసామగ్రి పంపిణీ చేశారు. నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్ అందజేశారు. నాయకులు శివలింగం, పురుషోత్తం, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన డీసీసీ మాజీ అధ్యక్షుడు



వెదురుకుప్పం, జూన్ 21: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను డీసీసీ తాజా మాజీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ కలిశారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో(పార్టీ కార్యాలయం) కలిసి జిల్లాలో పార్టీ స్థితిగతులపై చర్చించినట్లు భాస్కర్ తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆమె కోరినట్లు చెప్పారు.

ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు


చిత్తూరు సిటీ, జూన్ 21: ప్రమాణస్వీకారం చేసిన చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలకు టీడీపీ నేతలు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. శపథం మేరకు ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన కుప్పం ఎమ్మెల్యే నారా చంద్రబాబు నాయుడు, చిత్తూరు, పలమనేరు, గంగాధరనెల్లూరు, చంద్రగిరి, పూతలపట్టు నగరి ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, అమరనాథరెడ్డి, థామస్, పులివర్తి నాని, మురళీ మోహన్, గాలి భానుప్రకాష్‌లకు పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, మాజీ మేయర్ కటారి హేమలత, చంద్రప్రకాష్, కాజూరు బాలాజి, మోహన్‌రాజ్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయంలో చోరీ



కార్వేటినగరం, జూన్ 21: స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగులగొట్టి అందులో ఉన్న నగదును, కానుకలను చోరీ చేశారు. ఆలయం లోపలున్న బీరువాను సైతం ధ్వంసం చేశారు. సీసీ టీవీ ఫుటేజిని పట్టుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరులో భారీ వర్షం



చిత్తూరు కల్చరల్, జూన్ 21: నగరంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతతో కూడిన వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా చల్లబడింది. దాదాపు గంటపాటు వర్షం పడడంతో చిరు వ్యాపారులు, వాహనదారులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు. రోడ్లపై డ్రైనేజీలు పొంగి పొర్లాయి. వర్షాలకు నగరంలో పలు రోడ్లు దెబ్బతిన్నాయి. తద్వారా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

థామస్‌తోనే అభివృద్ధి : తెలుగు యువత

వెదురుకుప్పం, జూన్ 21: ఎమ్మెల్యే థామస్‌తోనే గంగాధర నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. టీఎన్ఎస్ఎఫ్ వెదురుకుప్పం మండలాధ్యక్షుడు బండి ఢిల్లీ ప్రసాద్‌రెడ్డి, యువ నాయకుడు పేట చూడామణిరెడ్డి మాట్లాడుతూ థామస్ గెలుపు నియోజకవర్గ అభివృద్ధికి మలుపు అని కొనియాడారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి మాట్లాడుతూ థామస్ ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

నగరి, జూన్ 21: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయ అన్నారు. శుక్రవారం మండల ప్రాథమిక పాఠశాల కాకవేడులో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. 14 ఏళ్ల లోపు వారు బడిలో ఉండాలన్నారు. పలకలు, బ్యాగులు, పుస్తకాలు అందించారు.

యోగాతో మానసిక ఆరోగ్యం





చిత్తూరులో యోగా సాధన చేస్తున్న ఎస్పీ మణికంఠ - ఆసనాలు వేస్తున్న అధికారులు, నగర ప్రముఖులు - ఐరాలలో యోగా చేస్తున్న అధికారులు

చిత్తూరు, జూన్ 21: యోగా మనసుకు ప్రశాంతతను, శరీరానికి మృదుత్వాన్ని అందిస్తుందని ఎస్పీ మణికంఠ అన్నారు. నగరంలోని ఒక కల్యాణ మండపంలో పోలీసు శాఖ తరపున శుక్రవారం 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ యోగా అనేది ప్రాచీన భారతీయ జీవన విధానమని, ఇది శరీరానికి, మనసుకు, ఆత్మకు ఆరోగ్యం, శాంతి, సమతుల్యత అందిస్తుందన్నారు. మానసిక ఒత్తిడికి గురయ్యే వారు క్రమం తప్పకుండా యోగా చేస్తే ఉపశమనం దొరుకుతుందన్నారు. ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ విష్ణు రఘువీర్, దిశా డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీలు మహబూబ్‌బాషా, ఇలియాస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పీవీకేఎన్ కళాశాల మైదానంలో..

చిత్తూరు, జూన్ 21: పీవీకేఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో నెహ్రూ యువకేంద్రం, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన జేసీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలన్నారు. అంతకుముందు జేసీ, ఇతర జిల్లా అధికారులు, నగర ప్రముఖులు యోగాసనాలు వేశారు. ఎస్పీ మణికంఠ, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి, ఏఎస్పీ అరీఫుల్లా, యోగా గురువులు బాబు, అను పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో..

చిత్తూరు (సెంట్రల్) : నగరంలోని పలు విద్యాసంస్థల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. సుందరరాజపురం విజయం సీబీఎస్ఈ పాఠశాలల్లో అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులు ఆసనాలు వేశారు. యోగా ద్వారా కలిగే ప్రయోజనాలను ఆమె విద్యార్థులకు తెలియజేశారు. ఎస్‌పీఎస్ సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారి షమ్స్ అక్తర్ ఆధ్వర్యంలో విద్యార్థినులు యోగాసనాలు వేశారు.

ఐరాల : యోగాతో ఆయుష్షు పెరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐరాల సచివాలయంలో తహశీల్దార్‌తోపాటు సచివాలయ ఉద్యోగులు యోగా చేశారు.

నగరి : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు యోగాసనాలు వేశారు. మనస్సు-శరీరం, వ్యక్తి-సమాజం మధ్య సామరస్యాన్ని, శాంతిని పెంపొందించే సాధనమే యోగా అని ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు. జూనియర్ సివిల్ కోర్టులో సీనియర్ న్యాయవాది సోమసుందరం ప్రాణాయామంపై అవగాహన కల్పించారు. జడ్జి విష్ణువర్మ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులు యోగసనాలు వేశారు.

యాదమరి : మండలంలోని బుడితిరెడ్డిపల్లె పంచాయతీలో అమృత్ సరోవర్ కుంట వద్ద శుక్రవారం ఉపాధి కూలీలతో కలిసి అధికారులు యోగా దినోత్సవం జరుపుకున్నారు. డ్వామా పీడీ రాజశేఖర్ హాజరై ఉపాధి కూలీలతో కలిసి యోగా చేశారు. అనంతరం రైతు అనంద్ పొలంలో ఫారంపాండ్ పనులను ప్రారంభించారు.

బంగారుపాళ్యం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో యోగాసనాలు, వ్యాయామాలు చేయించారు. తుంబకుప్పం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులతో 16 ఆసనాలను వేయించారు. ఎంఈవో నాగేశ్వరరావు, ఎంఈవో-2 రమేష్, హెచ్‌ఎం పార్థసారథి పాల్గొన్నారు.

పూతలపట్టు : స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులు యోగా చేశారు. దీన్ని పాటించడం ఆరోగ్యానికి మంచిదన్నారు. ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

వెదురుకుప్పం : తిరుమలయ్యపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆసనాలు వేయించారు. విశ్రాంత వ్యాయామ సంచాలకులు మునికృష్ణయ్య, దామోదరం యోగా విశిష్టతను వివరించారు. ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్ ఉపాధ్యాయ బృందంతో కలసి విద్యార్థులకు ఆసనాలు వేయించి, యోగా గురించి విశదీకరించారు. చవటగుంట వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.

కార్వేటినగరం : స్థానిక రాస్ వృద్ధాశ్రమంలో యువమోర్చా నేత యువరాజు ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పాలసముద్రం : మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో యోగా దినోత్సవం నిర్వహించారు. పాలసముద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిపాల : మండలంలోని బొమ్మసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీఎస్ఆర్ కళాశాల, ఏఎల్‌పురం హైస్కూల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు దేవరాజన్, అధ్యక్షుడు చంద్ర, బీజేపీ మండలాధ్యక్షుడు ధనుంజయ నాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు రూరల్, జూన్ 21: చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలోని 33, 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా చిత్తూరు రూరల్, నగరం, పూతలపట్టు, పాలసముద్రం, గుడిపాల, పెనుమూరు మండలాల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ మునిచంద్ర తెలిపారు. చిత్తూరు నగరంలోని కొంగారెడ్డిపల్లి, సంజయ్‌గాంధీ నగర్, తేనెబండ, శ్రీనివాసపురం, మార్కెట్, రామ్‌నగర్ కాలనీ, జానకారపల్లి, పలమనేరు రోడ్డు, టెలిఫోన్ కాలనీలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని కుర్చివేడు, అనంతాపురం, తొప్పాతిపల్లి, మర్రిగుంట, పెద్దిశెట్టిపల్లి, మాపాక్షి, తుమ్మింద, చెన్నసముద్రం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. పూతలపట్టు మండలం బండపల్లి, పోలవరం, లక్ష్మయ్యవూరు, ముత్తిరేవుల, పాలసుముంద్రం మండలం సింహరాజపురం, నరసింహపురం, గుడిపాల మండలం కొత్తపల్లి, పానాటూరు, ఏఎల్‌పురం, పెనుమూరు మండలం కలవగుంట, శాతంబాకం, పంటపల్లి, కలికిరి, లవకిపల్లి, మఠంపల్లి పాంతాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 9 నుంచి 12 వరకు విద్యుత్ ఉండదని ఒక ప్రకటనలో తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు రూరల్, జూన్ 21: సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన వైద్యాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీరు కలుషితమై వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పంచాయతీ అధికారి, ఆశాలు, వైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో అత్యవసర మాత్రలు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. కాలువలు, తాగునీటి ట్యాంకులు శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ఒకే గ్రామంలో ముగ్గురు కంటే ఎక్కువ మంది జ్వర బాధితులు ఉంటే మెడికల్ క్యాంపు నిర్వహించాలని ఆదేశించారు.

అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు


సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె, జూన్ 21: అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులకు దర్శనం కల్పించి, స్వామివారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, మేళతాళాల నడుమ ప్రాకారోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

వైసీపీ అరాచకాలపై విచారణ చేపట్టండి


అనితను సన్మానిస్తున్న గాంధీ

గంగాధరనెల్లూరు, జూన్ 21: రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితకు వేపంజేరి మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ విన్నవించారు. సెక్రటేరియట్‌లో శుక్రవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బాలకృష్ణను కలిశారు. వైసీపీ ఆగడాలతో ప్రాణాలు పోగొట్టుకున్న వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 15 మందికి జరిమానా

చిత్తూరు, జూన్ 21: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందిని చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వారిని శుక్రవారం జిల్లా కోర్టులో జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. ఆమె ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ నిత్యబాబు తెలిపారు. నిందితుల నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేసినట్లు వివరించారు.

బంగారుపాళ్యం : మండలంలో 8 మందికి జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా శుక్రవారం బంగారుపాళ్యం పోలీసులు అదుపులోకి తీసుకుని, చిత్తూరు కోర్టుకు హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ లక్ష్మయ్య ఈ సందర్భంగా తెలిపారు.

సచివాలయాలకు సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు




వెదురుకుప్పం, జూన్ 21: మండలంలోని మాంబేడు, నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయాలకు శుక్రవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలను టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి మోహన్‌యాదవ్, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గాలి బాబునాయుడు అందజేశారు.

వీనులవిందుగా రామాంజనేయ నామ సంకీర్తన

చిత్తూరు కల్చరల్, జూన్ 21: పీజీఆర్ పోలీస్ టాప్‌లైన్ కోదండరామాలయంలో శుక్రవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చెన్నైకు చెందిన భజన కళాకారులు రామానుజదాసర్ ఉదయ్‌కుమార్ భజన బృందం హనుమాన్ చాలీసా, సుందరకాండలను 108 ఆవర్తనాలతో 108 శాస్త్రీయ సంగీత రాగాలతో పారాయణం చేసి, భక్తులను తన్మయపరిచారు.

మంత్రులను కలసిన యుగంధర్


మంత్రి దుర్గేష్‌కు ప్రసాదాలు అందజేస్తున్న యుగంధర్

వెదురుకుప్పం, జూన్ 21: రాష్ట్ర మంత్రులను శుక్రవారం జనసేన పార్టీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న అమరావతిలో కలిశారు. పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్, రవాణా శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశామని యుగంధర్ తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల ఏర్పాటు



చిత్తూరు రూరల్, జూన్ 21: చిత్తూరు రూరల్ పాలూరు గ్రామ సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలను శుక్రవారం పాలూరు మాజీ సర్పంచ్ మోహన్‌రాజ్ ఏర్పాటు చేశారు. పంచాయతీలో అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

ఇసుక తరలిస్తూ ఒకరి అరెస్టు

వెదురుకుప్పం, జూన్ 21: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఒకరిని అరెస్టు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు కార్వేటినగరం సీఐ సత్యబాబు శుక్రవారం తెలిపారు. ఎస్ఆర్‌పురం మండలం తుంగమిట్టకు చెందిన వినోద్ తన ట్రాక్టరులో ఇసుకను తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. వినోద్‌ను అరెస్టు చేసి, కేసు నమోదు చేశామన్నారు.

పశువైద్యశాల సిబ్బంది సక్రమంగా పనిచేయాలి

పాలసముద్రం, జూన్ 21: మండలంలోని పశువైద్యశాల సిబ్బంది, గోపాలమిత్రలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా వైద్యం అందించాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ గోవిందయ్య పేర్కొన్నారు. శుక్రవారం పాలసముద్రం పశువైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువైద్యాధికారి యశస్వి పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి పూజలు


గిరి ప్రదక్షిణలో స్వామివారు

చిత్తూరు కల్చరల్, జూన్ 21: గిరింపేట వళ్లీ దేవసేన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో శుక్రవారం పౌర్ణమి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. మూలవర్లను ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లోనూ సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. పల్లకి సేవ నిర్వహించారు.